లేత మనసుపై చెరగని గాయం

మెదక్ జిల్లాలో చిన్నారులపై లైంగిక వేధింపుల కేసులు పెరుగుతున్నాయి. బాలికలను లక్ష్యంగా చేసుకొని కొందరు వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. మహిళలు, బాలల కోసం ఎన్ని చట్టాలు చేసినా జరిగే అనర్థాలు జరుగుతూనే ఉన్నాయి. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ తరచుగా ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి పోలీసులు, న్యాయ వ్యవస్థ ప్రత్యేక శ్రద్ధతో చూపుతున్నా ఆశించినంతగా ఫలితం కనిపించడం లేదు. చట్టాల్లో లొసుగులను అడ్డం పెట్టుకొని కొందరు నిందితులు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు.

- కఠిన చట్టాలున్నా ఆగని అరాచకాలు
- తెలిసిన వాళ్లే కీచకులు.. పెరుగుతున్న కేసులు
- పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నా కనిపించని మార్పు
- మెదక్ జిల్లాలో పెరుగుతున్న పోక్సో కేసులు
- గతేడాది జిల్లాలో 71 కేసులు..
- ఈ ఏడాది ఇప్పటివరకు 27 నమోదు



మెదక్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లైంగిక నేరాల నుంచి మైనర్లను రక్షించడానికి 2012లో పోక్సో (పీవోసీఎ్‌సవో) చట్టం తీసుకొచ్చారు. అయినా జిల్లాలో లైంగిక వేధింపులు ఆగడం లేదు. మెదక్ జిల్లాలో గతేడాది 71 పోక్సో కేసులు నమోదు కాగా.. నాలుగు కేసుల్లో మాత్రమే శిక్షలు ఖరారయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి 27 కేసులు నమోదయ్యాయి. జిల్లాలో గతేడాది 32 అత్యాచార కేసులు కూడా నమోదయ్యాయి. ఆయా ఘటనల్లో నిందితులు బంధువులు, తెలిసినవారే కావడం బాధాకరం. మహిళలపై జరిగే నేరాల్లో పోక్సో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. లైంగిక దాడులు, అత్యాచారాలు లేత మనసులను గాయపరుస్తున్నాయి. వారి చదువులు, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కౌమార దశలో ఉన్న బాలబాలికలు ముంచుకొచ్చే ముప్పును పసిగట్టలేరు. ఎవరైనా దురుద్దేశంతో ప్రవరిస్తే గట్టిగా ప్రతిఘటించలేరని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. దీనిని అలుసుగా తీసుకొని వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. చాక్లెట్లు, మిఠాయిలు, తినుబండారాలు ఆశజూపి కొందరు పిల్లలను బయటకు తీసుకెళ్లి లైంగికదాడులకు పాల్పడటం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అలాంటి వాటిని సున్నితంగా తిరస్కరించేలా బాలకలకు తల్లిదండ్రులు తెలియజెప్పాలి. పాఠశాల, కళాశాలల్లో ఎవరైనా అనుచితంగా ప్రవరిస్తున్నారా అని తెలుసుకోవాలి. ఎంత దగ్గరివారైనా అతి చనువుగా ప్రవరిస్తుంటే తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలి.

అవగాహన కల్పిస్తున్నాం



షీ టీమ్స్‌పై చైతన్యం కల్పించేందుకు కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పిల్లలు కార్యకలాపాలపై తల్లిదండ్రులు దృష్టిసారించాలి. ఈవ్‌టీజింగ్, వేధింపుల వంటి సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

-మహేందర్, మెదక్ అదనపు ఎస్పీ



చిన్నశంకరంపేటలో వర్షం

వదలని అకాల వర్షం

పలుచోట్ల ఉరుములు మెరుపులతో వాన

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/చిన్నశంకరంపేట/శివ్వంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల శుక్రవారం కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పగలంతా తీవ్రంగా ఎండ ఉన్నా సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఒక్కసారి వాతావరణం చల్లబడి ఊరట ఇచ్చింది. యాసంగి కోతలు జోరుగా సాగుతున్న క్రమంలో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించిన, రోడ్లపై ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. దీంతో రైతన్నలు అయోమయానికి గురయ్యారు. శివ్వంపేట, చిన్నశంకరంపేట మండలాల్లో పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నారాయణఖేడ్ డివిజన్‌లో మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో జల్లులు కురిశాయి. నాగల్‌గిద్ద మండల పరిధిలోని కరముంగి, గౌడ్‌గాంజన్‌వాడ, దామర్‌గిద్ద తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. పంటలకు నష్టం జరిగింది.

తూనికలు, కొలతల్లో అక్రమాలపై ఉక్కుపాదం

- ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తే కేసులు, జరిమానా
- పెట్రోల్ బంకుల్లో మోసాలపై కఠిన చర్యలు
- సంగారెడ్డి జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి అనిల్‌కుమార్



ఎం.అనిల్‌కుమార్

ఫేస్ టు ఫేస్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తూనికలు, కొలతల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారి ఎం.అనిల్‌కుమార్ హెచ్చరించారు. తూనికల్లో మోసాలు, అక్రమాలు, వినియోగదారులు, వ్యాపారులు పాటించాల్సిన నిబంధనలపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

ఎంఆర్‌పీ కంటే ఎక్కువ రేట్లకు విక్రయిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

తక్కువ తూకం, తక్కువ కొలతలతో పాటు, ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువ రేట్లకు వస్తువులను విక్రయించినట్లు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తాం. నిబంధనలు ఉల్లంఘనలకు పాల్పడినవారిపై కేసులు నమోదు చేయడంతో పాటు మోసం తీవ్రతను బట్టి రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానాలు విధిస్తాం.

పెట్రోల్ బంకుల్లో మోసాలను ఎలా గుర్తించవచ్చు?

పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోల్ పోసుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. మీటర్‌లో తప్పనిసరిగా జీరో నిర్ధారించుకున్న తర్వాతే పెట్రోల్ పోయించుకోవాలి. కొలతలతో పాటు నాణ్యతలో తేడాలు గుర్తిస్తే నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

వ్యాపారులు, వినియోగదారులకు మీరిచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

పెట్రోల్ బంకుల కొలతలు, వేబ్రిడ్జిలు, రేషన్‌షాప్‌లు, రిటైల్, హోల్‌సేల్, కిరాణ, మటన్, చికెన్, ఫిష్. నిత్యావసర సరుకుల తూనికల్లో తేడాలుంటే వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు వినియోగదారుడు రసీదు తీసుకోవాలి. వీటితో పాటు ప్రతి ప్యాకేజ్డ్ వస్తువుపై ఎంఆర్‌పీ, డేట్ ఆఫ్ ప్యాకింగ్, అడ్రస్, కన్స్యూమర్ కేర్ నంబర్ ఉన్న వస్తువులను మాత్రమే వ్యాపారులు సేల్ చేయాలి. వినియోగదారులు మోసపోయినా, అనుమానం ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్ 180042500333, 8523011449 నంబర్లకు లేదా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వ్యాపారులు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాంటా, తూనికరాళ్లపై ప్రతీ రెండేళ్లకోసారి అధికారిక ముద్రలు కచ్చితంగా వేసుకోవాలి. లేదంటే తనిఖీల్లో పట్టుబడితే కేసులతో పాటు జరిమానా వేస్తాం.

తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే ఏం చేయాలి?

కొనుగోలు చేసిన వస్తువు నాణ్యంగా ఉన్నదా.. కొలతలు సరిగా ఉన్నాయా అని సరిచూసుకోవాలి. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండని వస్తువులను గుర్తిస్తే వెంటనే లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటారు.

ఉగ్రదాడిపై వెల్లువెత్తిన నిరసన

పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళిగా శుక్రవారం రాత్రి మెదక్ పట్టణంలో ముస్లింలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని పలుచోట్ల నల్ల రిబ్బన్లు ధరించి శుక్రవారం ప్రార్థనలు నిర్వహించారు.

-మెదక్



ధాన్యం కొనుగోళ్లల్లో జాప్యం చేయొద్దు

రాష్ట్ర కన్స్యూమర్, ఫుడ్ అండ్ సివిల్ సప్లయ్ జాయింట్ సెక్రెటరీ ప్రియాంక ఆల 7


ఉపాధిహామీ పనులు భేష్

● విదేశీ ప్రతినిధుల కితాబు ● సురారంలో ఉపాధిహామీ పనుల ప్రగతి పరిశీలన

సదాశివపేట, ఏప్రిల్ 25: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు బాగుందని విదేశీ ప్రతినిధులు కితాబిచ్చారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం సురారం గ్రామంలో పర్యటించింది. పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ సృజన, కలెక్టర్ వల్లూరు క్రాంతి స్వాగతం పలికారు. బృందం సభ్యులు గ్రామంలో ఈజీఎస్ పథకానికి అనుసంధానంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పథకం ద్వారా లబ్ధి పొందుతున్న కూలీలతో మాట్లాడారు. ఉపాధి అవకాశాలు, వేతన చెల్లింపులు, మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై సమాచారం సేకరించారు. అనంతరం అధికారులు, కలెక్టర్ విదేశీ బృందానికి ఈజీఎస్ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న నీటి సంరక్షణ, పల్లె ప్రగతి పనులపై ఫొటో ప్రదర్శన చూపించారు. పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ గురించి వివరించారు. అనంతరం విదేశీ ప్రతినిధులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పేదల జీవన ప్రమాణాల్లో జరిగిన మార్పులు తమకు సంతృప్తినిచ్చాయని విదేశీ ప్రతినిధుల బృందం కితాబిచ్చింది. డిజిటల్ మానిటరింగ్ విధానాలు, పారదర్శక చెల్లింపుల వ్యవస్థలు, మహిళల భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అడిషనల్ కమిషనర్ శేషకుమార్, ఎస్‌పీఎం మురళి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, అదనపు డీఆర్డీవోలు బాలరాజు, జంగారెడ్డి, ఎన్జీవో ప్రతినిధులు వర్షిణి, సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, సదాశివపేట తహసీల్దార్ కె.సరస్వతి, ఎంపీడీవో కె.లక్ష్మి, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విదేశీ ప్రతినిధుల బృందంతో కలెక్టర్ వల్లూరు క్రాంతి, పంచాయతీరాజ్ కమిషనర్ సృజన



తరగతి గదిలో శ్రీనివాస్ వేసిన చిత్రం

క్లాస్‌రూమే.. క్యాన్వాస్

- ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్న టీచర్ 7

వేర్వేరుచోట్ల ఐదుగురి ఆత్మహత్య

- కుటుంబకలహాలతో ఉరేసుకున్న ఇద్దరు
- పాపన్నపేటలో గుర్తుతెలియని వ్యక్తి
- బుదేరాలో ఉరేసుకుని ఒకరు
- గడ్డిమందు తాగి తూప్రాన్‌లో యువకుడు

6

కబ్జా కోరల్లో నక్కవాగు

● వాగును పూడ్చి నిర్మాణాలు, ప్లాట్లు ● దర్జాగా విక్రయిస్తున్న పెద్దలు



నక్కవాగులో మట్టిపోసి పూడ్చివేత, సిమెంటుతో వాగుకు ఒక్కవైపు కట్ట కట్టడంతో కుచించుకుపోయిన నక్కవాగు

రామచంద్రాపురం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు రెండు జిల్లాల్లో గలగలాపారిన వాగు ఇప్పుడు ఆక్రమణల బారినపడి కుంచించుకుపోయింది. మట్టి పోసి పూడ్చేసి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ముత్తంగి గ్రామం జీపీఆర్, బృందావనం, సాయి గార్డెన్స్, గ్రీన్‌ల్యాండ్స్ లేఅవుట్ మీదుగా నక్క వాగు ప్రవహిస్తుంది. ఒకప్పుడు నిండుగా వర్షపు నీరు పారుతూ నదిని తలపించే వాగు ప్రస్తుతం ఆక్రమణలతో కుంచించుకుపోయింది. వాగులో మట్టి, పెద్దబండరాళ్లు పోసి ఆక్రమిస్తున్నారు. ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందుకు మున్సిపల్ అధికారులు అనుమతులు జారీ చేస్తున్నారు. వాగును ఒకవైపు మూసివేయడంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వంటి నిబంధనలు అధికారులు పట్టించుకోలేదు. ఓ నిర్మాణ సంస్థకు చెందిన పరిశ్రమవారు ఆరెకరాల్లో పెద్దఎత్తున షెడ్లు నిర్మించారు. ఇందులో ఎకరాకు పైగా వాగును ఆక్రమించినట్లు ఆరోపణలున్నాయి. షెడ్లు నిర్మించిన లేఅవుట్‌లో వేలాది గజాలమేర రోడ్లను ఆక్రమించినట్లు తెలుస్తున్నది. నక్కవాగును ఆక్రమణల విషయంలో ముత్తంగి, నందిగామ, కర్దనూరు గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అనుమతులు పొందుతున్నారు. ఇందుకు పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నట్లు తెలుస్తున్నది.



మెదక్‌లో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ఎడ్లబండిపై వస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రోహిత్‌రావు

8

భూ భారతి చరిత్రాత్మకం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రోహిత్
- మెదక్‌లో అవగాహన సదస్సు, ఎడ్లబండ్ల ర్యాలీ
- భారీగా తరలివచ్చిన రైతులు

బైపాస్ జంక్షన్ మూసివేసేందుకు యత్నం

అడ్డుకుని ఆందోళన చేసిన స్థానికులు

ఎన్‌హెచ్ ఇంజనీర్లతో వాగ్వాదం

రామాయంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట బైపాస్ జంక్షన్ వద్ద రహదారిని మూసేందుకు వచ్చిన అధికారులను శుక్రవారం శుక్రవారం స్థానికులు అడ్డుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు పట్టణం నుంచి వెలుపలికి వెళ్లే సమయంలో జంక్షన్ వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై హైకోర్టులో కేసు నమోదైంది. దీనిపై విచారించిన కోర్టు హైవేపై ఇరువైపులా బైపాస్ రోడ్డు నిర్మించినందున జంక్షన్ మూసేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించింది. కోర్టు ఆదేశాలమేరకు ఇంజనీర్ల పర్యవేక్షణలో రోడ్డు మూసివేత పనులు చేపట్టాలని నిర్ణయించారు. మెటీరియల్ అక్కడ వేస్తుండగానే విషయం తెలుసుకున్న గుల్పర్తి గ్రామస్థులతోపాటు స్థానికులు పెద్దఎత్తున చేరుకుని గొడవకు దిగారు. అధికారులు తెచ్చిన నిర్మాణ మెటీరియల్ తీసి పక్కన పడేశారు. దీంతో, గంటపాటు ఘర్షణ వాతావరణం నెలకొన్నది. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకొని స్థానికులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. అయినా, వినకపోవడంతో ఎట్టకేలకు పనులు మధ్యలోనే ఆపేసి నేషనల్‌హైవే అధికారుల బృందం వెనక్కు వెళ్లింది. కానీ, దారిని మూసేయన తప్పదంటూ అధికారులు తేల్చి చెప్పారు.





రామాయంపేట వద్ద హైవేపై ఆందోళన చేస్తున్న స్థానికులు, శాంతింపజేస్తున్న పోలీసులు

ఏడుపాయల్లో నీట మునిగి ఒకరి మృతి


వీరస్వామి మృతదేహం

పాపన్నపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బంధువుల విందు కోసం వచ్చిన వచ్చిన ఒకరు శుక్రవారం ఏడుపాయల్లో నీట మునిగి చనిపోయారు. వివరాల్లోకి వెళితే.. నాగర్ కర్నూలు జిల్లాలోని పెద్ద కొత్తపల్లి మండల పరిధి మరికెల్ గ్రామానికి చెందిన వీరస్వామి(40) తన భార్య మల్లేశ్వరి, ముగ్గురు కుమార్తెలు, బాబుతో కలసి తన బంధువుల విందులో పాల్గొనడానికి శుక్రవారం ఉదయం ఏడుపాయలకు వచ్చారు. అమ్మవారి దర్శనానికి ముందు స్నానం చేసేందుకు చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మృతుడు పెయింటర్‌గా పనిచేసే వాడని కుటుంబీకులు తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరి మృతి


బాల్‌రాజ్(ఫైల్)


నవీన్(ఫైల్)

నర్సాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారి రుస్తుంపేట గేటు సమీపంలో గురువారం రాత్రి రెండుబైకులు ఢీకొనగా ఇద్దరు మృతిచెందారు. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా చౌటకూర్‌కు చెందిన బాల్‌రాజ్(32) బైక్‌పై నర్సాపూర్ వైపు నుంచి చౌటకూర్‌కు వెళ్తున్నాడు. నర్సాపూర్‌కు చెందిన చింతకుంట నవీన్(26) దౌల్తాబాద్ వైపు నుంచి నర్సాపూర్‌కు బైక్‌పై అతివేగంగా వస్తున్నాడు. ఈ క్రమంలో నవీన్ బైక్‌తో, బాల్‌రాజ్ బైకును ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, సమీపంలోని వారు అంబులెన్సు ద్వారా నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. అయితే, బాల్‌రాజ్ ఆసుపత్రికి తరలించగా అక్కడ డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతిచెందాడని తెలిపారు. నవీన్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించగా అక్కడ చనిపోయారు.. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాల్‌రాజ్‌కు భార్యతో పాటు 13 ఏళ్ల కూతురు, పదేళ్ల కుమారుడు ఉండగా, నవీన్‌కు పెళ్లి కాలేదని ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఐదుగురి ఆత్మహత్య

- కుటుంబకలహాలతో ఉరేసుకున్న ఇద్దరు
- పాపన్నపేటలో గుర్తుతెలియని వ్యక్తి
- బుదేరాలో చెట్టుకు ఉరేసుకుని ఒకరు
- గడ్డిమందు తాగి తూప్రాన్‌లో యువకుడు

రామాయంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రామాయంపేట మండల పరిధి ఝాన్సీలింగాపూర్‌లో జరిగింది. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కలవాల రాజు(35) శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ప్రాణాలు వదిలాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబీకులకు విషయాన్ని తెలుపగా.. అక్కడి చేరుకున్న భార్య లక్ష్మి కన్నీరుమున్నీరైంది. ఈ మేరకు ఎస్‌ఐ బాలరాజ్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అల్వాలలో యువకుడు..

మిరుదొడ్డి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కుటుంబకలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ పర్శరాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొగాకు స్వామి(31) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల రూ.11 లక్షలతో ఒక వాహనాన్ని కొనుగోలు చేయగా, ఈ విషయంలో స్వామికి, అతడి భార్యకు మధ్య తరచూ గొడవలు జరిగేవి. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వామి ఉరేసుకున్నాడు. స్వామికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

పాపన్నపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పాపన్నపేటలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. పాపన్నపేట శివారులో గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఉండటాన్ని శుక్రవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. వ్యక్తి వయస్సు 30-40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై కుంకుమ రంగు షర్టు, నలుపు గ్రే రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. పది-పదిహేను రోజుల క్రితం ఉరేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఇంట్లో నుంచి వెళ్లి.. చెట్టుకు ఉరేసుకుని

మునిపల్లి, ఏప్రిల్ 25: (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకున్న ఘటన మునిపల్లి మండలం బుధేరా గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మునిపల్లి ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుదెరా గ్రామానికి చెందిన కొల్కొంద శ్రీనివాస్(44) మూడు రోజులు క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు శ్రీనివాస్ కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకుని ఉన్న శ్రీనివాస్‌ను అటుగా వెళ్లిన గొర్రెకాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ భార్య స్వప్నకు సమాచారం అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ..

మనోహరాబాద్ ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించ లేక గడ్డిమందు తాగి వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందిన ఘటన తూప్రాన్ పట్టణంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గజ్జెల బాబు(32)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాబు ఆటో నడుపుతుంటాడు. భార్య ఆరోగ్యం బాగాలేక పోవడంతో ఆసుపత్రి కోసం అప్పులు చేశాడు. అప్పులు పెరగిపోవడం, కుటుంబం గడవక ఏమీ చేయాలో తెలియక ఈనెల 18న గడ్డి మందు తాగడు. కుటుంబసభ్యులు బాబును తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవం..
తెలంగాణ పండుగ

- 25 ఏళ్ల వేడుకల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు


టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న హరీశ్‌రావు (ఫైల్)

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 25: బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న రజతోత్సవ వేడుకలు, యావత్ తెలంగాణకు పండుగ లాంటిదని, ఈ సభ తెలంగాణలోని ప్రతి ఒక్కరికి విజయోత్సవం కావాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని నియోజకవర్గ ఇన్‌చార్జీలు, నాయకులతో శుక్రవారం హరీశ్‌రావు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సుదీర్ఘ కాలం పాటు అలుపెరుగని పోరాటం చేసి రాష్ట్రం సాధించినా, పదేళ్లలో తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపినా అది కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకే సాధ్యమైందన్నారు. అంతటి ఘనచరిత్ర కలిగిన పార్టీ 25 ఏళ్ల పండుగలో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. వాహనాల ఏర్పాటు, నీటి వసతి, భోజనం సహా ఏ విషయంలోనూ కార్యకర్తలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, సాయంత్రం 5 గంటల్లోపు సభాస్థలికి వచ్చేలా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అందరూ ఏవిధంగా అయితే సభకు వస్తున్నారో, అంతే సురక్షితంగా ఇళ్లు చేరేలా ఇన్‌చార్జీలు, నాయకులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. సమన్వయంతో ఉంటూ, క్రమశిక్షణ పాటిస్తూ బహిరంగ సభను సక్సెస్ చేసి ఉమ్మడి మెదక్ జిల్లా సత్తా చాటాలన్నారు.

బీఆర్ఎస్ సభకు 26 కారుల్లో..



గులాబీ రంగులోని అంబాసిడర్ కార్లు

రామచంద్రాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని ఎల్కతుర్తి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.రాములుగౌడ్ కుమారుడు బీఆర్ఎస్ యువ నాయకుడు సాయిచరణ్‌గౌడ్ 26 కార్లలో కార్యకర్తలను తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేశాడు. మొత్తం 26 అంబాసిడర్ కార్లను అద్దెకు తీసుకుని, గులాబీమయంగా అలంకరించారు. శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో ప్రారంభిస్తామని సాయిచరణ్ గౌడ్ తెలిపారు.

అర్ధరాత్రి ఆగమైన తల్లీకుమారులు

- బంధువుల ఇంటి వద్దకు చేర్చిన పోలీసులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ తల్లి, ఇద్దరు కుమారులు అర్ధరాత్రి బస్సులో ఓ చోట దిగబోయి మరోచోట దిగడంతో ఎటు వెళ్లలేని పరిస్థితుల్లో పోలీసులు బంధువుల ఇంటికి చేర్చారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరికి చెందిన దుర్గభవాని తన ఇద్దరు కుమారులతో గురువారం హైదరాబాద్‌కు వచ్చి ఓపెన్ ఇంటర్ పరీక్ష రాసింది. అనంతరం గజ్వేల్‌లో బంధువుల ఇంటి వద్దకు వెళ్దామని రాత్రి జేబీఎస్‌లో బస్సు ఎక్కారు. వారు ప్రజ్ఞాపూర్‌లో దిగాల్సి ఉండగా కుకునూరుపల్లిలో దిగారు. రాత్రి 1:00 సమయంలో దుర్గభవానికి ఏం చేయాలో, ఎక్కడికి వెళ్లాలో తెలియక డయల్ 100కి కాల్ చేసి వివరాలను తెలిపింది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ జగదీశ్వర్, కానిస్టేబుళ్లు విఠల్, రామచంద్రరెడ్డి హుటాహుటిన బాధితుల వద్దకు వచ్చి గజ్వేల్‌లోని బంధువుల ఇంటి వద్దకు చేర్చారు.





తరగతి గది గోడపై శ్రీనివాస్ వేసిన మహనీయుల చిత్రాలు, రాసిన వారి వివరాలు, మరో గోడపై వేసిన చిత్రం

క్లాస్‌రూమే.. క్యాన్వాస్

ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్న టీచర్


నారాయణఖేడ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆయన వృత్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి పెయిటింగ్. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన అందె శ్రీనివాస్ బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే చిత్రకారుడిగా మెప్పు పొందుతున్నారు. తన కళ పలువురికి ఉపయోగంగా ఉండాలనే ఆలోచనతో తాను పని చేసే పాఠశాల తరగతి గదుల గోడలనే కాన్వాస్‌గా మార్చుకున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే చిత్రాలను తీర్చిదిద్దుతున్నారు.

పాఠశాల గోడలపై ఎన్నో..

శ్రీనివాస్ పెన్సిల్ స్కెచ్, ఆయిల్ పెయింటింగ్, చాక్ ఆర్ట్, సాండ్ ఆర్ట్, తంజావూరు పెయింటింగ్స్, త్రీడీ తంజావూరు పెయింటింగ్స్, త్రీడీ పేయింటింగ్స్, సైన్ బోర్డ్స్‌పై చిత్రాలు వేస్తారు. ఇప్పటివరకు నారాయణఖేడ్ మండలం ర్యాలమడుగు, పంచగామ, మాణిక్‌నాయక్ తండా, పగిడిపల్లి, నర్సాపూర్, కల్హేర్ మండలం క్రిష్టాపూర్, సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాం పాఠశాలల్లో తెలుగు అక్షర మాలతో పాటు అచ్చులు, హల్లులు, ఏబీసీడీలు గుణింతాలు, అంకెలు, వివిధ రకాల ఆకారాలు, జాతీయ చిహ్నాలు, పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే మెను వివరాలు, వర్ణమాలలు, సూక్తులు, దేశ నాయకుల సందేశాలు, తులామానం, కాలమానం, ప్రధాన సంఖ్యలు, రోమన్



శ్రీనివాస్ గీసిన అల్ఫాబెట్స్


శ్రీనివాస్ తీర్చిదిద్దిన ఆదిశంకరాచార్య త్రీడీ పెయిటింగ్

సంఖ్యలు, హిందు, అరబిక్ సంఖ్యలు, స్థానక పట్టికలు, గణిత చిహ్నాలు, రంగులు, కూరగాయలు, నృత్యం, శరీర భాగాల వివరాల, ఇంగ్లిష్ నెలలు, వర్షం చిత్రాలను చక్కగా వేయడంతో, తరగతి గదులు రంగుల హరవిల్లు, ఇంద్రధనుస్సు మాదిరిగా మారాయి. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థులు వివిధ అంశాలను చక్కగా నేర్చుకోగల్గుతున్నారు. టీఎల్ఎంకు సంబంధించిన చిత్రాలను కూడా ఆయా పాఠశాల తరగతి గదులలో చిత్రీకరించడంతో, విద్యార్థులు ఆ చిత్రాల ద్వారా సులభంగా నేర్చుకుని, మర్చిపోకుండా ఉండగల్గుతున్నారు.

సొంత ఖర్చుతో..

శ్రీనివాస్ సబ్జెక్ట్ బయోసైన్స్ అయినప్పటికీ, ప్రవృత్తిగా నేర్చుకున్న చిత్రాలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సులభంగా నేర్చుకోవాలనే సంకల్పంతో సొంత ఖర్చుతో పెయింట్స్‌ను కొనుగోలు చేసి చిత్రాలను వేస్తున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే చిత్రాలే కాకుండా తెలంగాణ తల్లి, హరితహారం, దేశ నాయకుల చిత్రాలు మహాత్మగాంధీ, అంబేడ్కర్, నెహ్రూ, కాళోజీ, గోరేటి వెంకన్న, రవీంద్రనాథ్‌ఠాగూర్, సర్వేపల్లి రాధాకృష్ణ, చిత్రాలకు తోడు షిర్డీ సాయిబాబా, శివుడు, వెంకటేశ్వరస్వామి, ఆదిశంకరాచార్య, గణపతి, రాధాకృష్ణ, లక్ష్మీదేవి చిత్రాలను చక్కగా వేశారు. దీంతో శ్రీనివాస్ ఏ పాఠశాలలో అడుగు పెట్టిన ఆ పాఠశాల రూపురేఖలు మారుతున్నాయి.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికే



ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసమే నేను ప్రవృత్తిగా నేర్చుకున్న పెయింటింగ్‌తో పాఠశాల తరగతి గదుల గోడలపై చిత్రాలు వేస్తున్నాను. నేను వేసిన చిత్రాలతో విద్యార్థులు చక్కగా నేర్చుకుంటూ జ్ఞాపకం ఉంచుకుంటున్నారు. అందువల్లే పని చేసే పాఠశాలలే కాకుండా ఎవరైనా సహచర ఉపాధ్యాయులు కోరితే ఆయా పాఠశాలల్లోనూ చిత్రాలు వేస్తున్నాను.

- శ్రీనివాస్, చిత్రకారుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

చిత్రాలతో ఆహ్లాదకరంగా తరగతి గదులు



విద్యార్థులకు ఉపయోగపడే చిత్రాలు వేయడం వల్ల తరగతి గదులు ఆహ్లాదకరంగా మారుతున్నాయి. మా పాఠశాలలో శ్రీనివాస్ వేసిన చిత్రాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు చక్కటి విద్యాబోధన అందించగల్గుతున్నాం.

-నర్సింగ్, హెచ్‌ఎం, బొక్కస్‌గాం పాఠశాల, కల్హేర్ మండలం

సృజనాత్మక, స్వతంత్ర ఆలోచనలే
కొత్త వ్యాపార ఆవిష్కరణలకు నాంది

స్టార్టప్ మెంటర్ అక్షయ్ దేశ్‌పాండే

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సృజనాత్మకత, స్వతంత్ర ఆలోచనలు ఉన్నవారే కొత్త వ్యాపార ఆవిష్కరణలకు నాంది పలుకుతారని ప్రముఖ స్టార్టప్ మెంటర్ అక్షయ్ దేశ్‌పాండే అన్నారు. విద్యార్థుల్లో వ్యాపార ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎంటర్‌పెన్యూర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షయ్ దేశ్‌పాండే మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వాటికి తగిన పరిష్కారాలను అందించగలగడం ద్వారా విజయాన్ని సాధించవచ్చన్నారు. లింక్డ్‌ఇన్ వంటి వృత్తిపరమైన నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ చెన్నారెడ్డి, ఈడీసీ సెల్ కో ఆర్డినేటర్ గురుచరణ్‌దాసు, పీజీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'వెల్‌నెస్'లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. 'వెల్‌నెస్‌లో గడువు తీరిన ట్యాబ్లెట్లు' శీర్షికన ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి తనిఖీ చేపట్టారు. వెల్‌నెస్ సెంటర్‌లోని ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందులు, ఇన్-ఔట్ స్టాక్ పరిశీలించారు. పేషెంట్‌కు కాలం చెల్లిన మందులు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది. గడువు ముగిసిన ట్యాబ్లెట్లు ఎందుకు ఇంకా స్టాక్ ఉంచుకున్నారనే విషయాలను ఫార్మసిస్టులను అడిగి తెలుసుకున్నారు. మందులు తీసుకున్న పేషెంట్ కుటుంబ సభ్యులను కూడా ఫోన్‌లో సంప్రదించి ఆరా తీశారు. వెల్‌నెస్‌లోని ఫార్మసీ నిబంధనల ప్రకారం నిర్వహణలో లోపం ఉన్నట్టు గుర్తించారు. తనిఖీలో పరిశీలించిన అంశాలను రిపోర్టు రూపంలో పేర్కొని డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు నివేదించనున్నట్టు రవికిరణ్‌రెడ్డి తెలిపారు.

'ఎస్‌హెచ్‌టీవో'కు ఆరోగ్య శాఖ వాహనాలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలు ప్రభుత్వ వాహనాలను స్టేట్ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్(ఎస్‌హెచ్‌టీవో)కు తరలించే చర్యలు చేపట్టారు. 'వాహనాలకు తుప్పు.. ఎవరిదీ తప్పు?' అనే శీర్షికన ఈ నెల 2న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు కాలం చెల్లిన వాహనాలను కండమేషన్(తుక్కు) కోసం హైదరాబాద్ అమీర్‌పేటలోని ఎస్‌హెచ్‌టీవో కార్యాలయానికి తరలించే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు.

రూ.100 కోట్లతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు

- గురుకుల విద్యార్థులకు 75 శాతం రిజర్వేషన్
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి

బెజ్జంకి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ ద్వారా తోటపల్లి శివారులో రూ.100 కోట్లతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలగు వర్షిణి అన్నారు. బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామ శివారులో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి శుక్రవారం ఆమె స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అలుగు వర్షిణి మాట్లాడుతూ ఎమ్మెల్యే సత్యనారాయణ చొరవతో పరిపాలన అనుమతులు పూర్తయ్యాయని, సుమారు 100 ఎకరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. త్వరలో కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. గురుకుల విద్యాలయాల్లో చదివిన విద్యార్థులకు 75 రిజర్వేషన్ కల్పిస్తామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, తదితరులు ఉన్నారు.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న అలుగు వర్షిణి, మనుచౌదరి

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు

- రాష్ట్ర కన్స్యూమర్, ఫుడ్ అండ్ సివిల్ సప్లయ్ జాయింట్ సెక్రెటరీ ప్రియాంక ఆల

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో చిన్నచిన్న లోటుపాట్లు ఉంటే సవరించుకోవాలని, ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దని జిల్లా అధికారులను రాష్ట్ర కన్స్యూమర్, ఫుడ్ అండ్ సివిల్ సప్లయ్ జాయింట్ సెక్రెటరీ ప్రియాంక ఆల ఆదేశించారు. మెదక్ మండలంలోని కొంటూరు, రాజ్‌పల్లి, బాలానగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, లారీల సంఖ్య పెంచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, డీఎం సివిల్ సప్లయ్ సురేష్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మేనేజర్ జగదీష్, డీసీవో కరుణాకర్, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.


ప్యాడీక్లీనర్‌ను పరిశీలిస్తున్న ప్రియాంక ఆల

సంగారెడ్డి సెంట్రల్ జైలులో 30న ఐరన్ స్క్రాప్‌కు వేలం

కంది, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఐరన్ స్క్రాప్‌కు ఈనెల 30న వేలం నిర్వహించనున్నామని జైలర్ బి.సత్యం శుక్రవారం ఒక ప్రకటనలు తెలిపారు. జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి సెంట్రల్ జైలులోని స్టీల్ ఫ్యాక్టరీలో ఐరన్ స్క్రాప్ వేలం పాటకు హాజరయ్యే వ్యాపారులు రూ.5 వేలు అదే రోజు డిపాజిట్ చేయాలని తెలిపారు. వేలంలో స్క్రాప్‌ను దక్కించుకున్న వారు వెంటనే 18 శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాలి. అలాగే రెండు రోజుల్లో పూర్తి డబ్బులను చెల్లించి స్క్రాప్‌ను జైలు నుంచి తరలించాలనే నిబంధనలు విధించారు. వేలం పాటలో పాల్గొని రూ.5 వేలు డిపాజిట్ చేసిన మిగతా వారికి వేలంపాట అయిపోగానే తిరిగి ఆ డబ్బు చెల్లిస్తామని జైలర్ సత్యం తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు వినియోగించుకోవాలని కోరారు.

జిన్నారం ఆందోళనల కేసులో 19 మంది అరెస్టు

జిన్నారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిన్నారంలో జరిగిన ఆందోళనలో పోలీసులు కేసు నమోదు చేసి 19 మందిని అరెస్టు చేశారు. జిన్నారంలో శివుడి విగ్రహం ధ్వంసం, అనంతరం జరిగిన ఆందోళనలో పాల్గొన్న పలు గ్రామాలకు చెందిన 19 మందిని గుర్తించిన పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో మరికొందరిపైన పోలీసులు అభియోగాలు నమోదు చేశారు.


కోహెడలో చేతిపంపుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్ శ్రీనివాసాచారి

చేతిపంపు మెకానిక్‌లను పట్టించుకునే వారేరీ?

చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు.. సకాలంలో అందక అవస్థలు

అక్కన్నపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల నీటి అవసరాలను తీర్చే చేతిపంపు బోరు మెకానిక్‌లు చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నారు. కాస్త జీతం కూడా సకాలంలో అందక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న ప్రభుత్వం పర్మినెంట్ చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 మంది బోరు మెకానిక్‌లు ఉండగా, సిద్దిపేట జిల్లాలో 20 మంది వరకు పని చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో గ్రామాలలో చేతి పంపుల మరమ్మతుకు 1983లో కాంట్రాక్టు పద్ధతిలో మెకానిక్లను నియమించారు. 1990వరకు ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోనే పనిచేశారు. అందులో పని చేసిన కొంతమంది మెకానిక్‌లు రెగ్యులర్ అయ్యారు. ఆ తర్వాత ప్రభుత్వం వారిని మండల పరిషత్‌కు బదలాయించారు. కానీ, వారిని రెగ్యులర్ చేయలేదు. పంచాయతీరాజ్ శాఖకు కాంట్రాక్టు పద్ధతిలో నియామకమైన మెకానిక్‌కు మస్టర్ పద్ధతిలో రూ.9 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తున్నారు. ఈ కొద్దిపాటి వేతనం కూడా సకాలంలో చెల్లించడం లేదు. సిద్దిపేట జిల్లాలో 6 నెలల నుంచి 15 నెలల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచడంతో పాటు ప్రతీ నెల సక్రమంగా చెల్లించి, రెగ్యులర్ చేసి ఆదుకోవాలని బోరు మెకానిక్‌లు కోరుతున్నారు.

రెగ్యులర్ చేయాలి



28 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ బోరింగ్ మెకానిక్‌గా పనిచేస్తున్న. చాలి చాలని జీతాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్న. నాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 500 మంది మెకానిక్‌లు పని చేస్తున్నారు. ఇంతవరకు ఏ ప్రభుత్వం మమ్మల్ని రెగ్యులర్ చేయలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి బోరు మెకానిక్‌లను రెగ్యులర్ చేయాలి.

- తాళ్లపల్లి కొమురయ్య, చేతి పంపు మెకానిక్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

15 నెలలుగా జీతం రాలేదు



15 నెలల నుంచి జీతం రాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న. జీతాలు రాకున్నా ప్రజలకు నీటి సౌకర్యం అందించాలని చేతి పంపులు చెడిపోతే గ్రామాల్లోకి వెళ్లి మరమ్మతులు చేస్తున్నాం. ప్రభుత్వం జీతాలు సక్రమంగా అందించి రెగ్యులర్ చేయాలి.

- మిట్టపల్లి శ్రీనివాసాచారి, బోరింగ్ మెకానిక్, కోహెడ మండలం

భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి

● సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సులు

ఝరాసంగం/న్యాల్‌కల్/కోహీర్/మెదక్ అర్బన్/చేగుంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టానికి సంబంధించి సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆయా జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తుందని పేర్కొన్నారు. భూభారతి చట్టం ప్రకారం నిర్ణీత గడువు లోపు రైతులసమస్యలు పరిష్కార మవుతాయని, సమస్యలు పరిష్కారం కాకపోతే అప్పీలుకు వెళ్లడానికి ఆస్కారం ఉందన్నారు. నూతన చట్టంతో భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, నిషేధిత భూముల మార్పులు, చేర్పులు వంటి సేవలు సులభతరమవుతాయన్నారు. భూసమస్య పరిష్కారానికి ఆర్డీవో, కలెక్టర్‌లకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఝరాసంగంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి, చిత్రంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు



హవేళిఘణపూర్‌లో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, చిత్రంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో భూభారతిపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొని మాట్లాడారు. కొత్తగ ప్రవేశపెట్టిన భూభారతి చట్టంలోని ఒక్కో అంశంగురించి రైతులకు వివరించారు. అనంతరం న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో ఇందిరమ్మ లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. అదేవిధంగా కోహీర్ మండల కేంద్రంలోని భారత్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కొరకు భూభారతి ఒక ప్లాట్‌ఫామ్‌లాంటిదన్నారు. ఆయా కార్యక్రమాల్లో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ మాధురి, ఆర్డీవో రామ్‌రెడ్డి, తహసీల్దార్లు, రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాకేంద్రంలోని స్థానిక రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు హాజరైన మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు రైతులు ఎడ్లబండిపై స్వాగతం పలికారు. మహిళలు బోనాల ఊరేగింపుతో కార్యక్రమానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతితో రైతుల భూములకు పటిష్ట రక్షణ కలుగుతోందన్నారు. వచ్చే నెలలో మెదక్ జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, భూ సమస్యల పరిష్కారం కోసం రైతు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 2నుంచి భూభారతి చట్టం అమల్లోకి వస్తుందన్నారు కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, నాయకులు, రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలోనిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొని రైతులకు భూభారతి చట్టంలోని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. నార్సింగి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరై ఆర్‌వోఆర్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమాల్లో తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, ఆయా మండలాల అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అబాకస్ శిక్షణతో జ్ఞాపక శక్తి మెరుగు: సంగారెడ్డి డీఈవో



పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : అబాకస్ 2.0 అబాకస్ ఉచిత శిక్షణతో విద్యార్థుల్లో గణితం పట్ల భయం పోయి, ఏకాగ్రత, జ్ఞాపక శక్తి మెరుగుపడుతుందని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఎస్ఎస్ఏ కార్యాలయంలో విద్యార్థుల గణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన అబాకస్ 2.0 యాప్ ఉచిత శిక్షణ కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు అడ్లగట్ట గంగాధర్, సీఎంవో వెంకటేశం, ఏఎంవో బాలయ్య, జీసీడీవో సుప్రియ, ప్లానింగ్ కో ఆర్డినేటర్ తాజుద్దీన్ పాల్గొన్నారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రారంభించారు. వచ్చే నెల 15 వ తేదీ వరకు శాస్త్రీయ సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, చదరంగం, కుట్లు, అల్లికలు, యోగ, ధ్యానం, ఇండోర్ గేమ్స్ తదితర అంశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వట్‌పల్లి మండల పరిధిలోని మరవెల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రైజింగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లు ఎంఈవో గోవింద్ రెడ్డి తెలిపారు. మనూరు హైస్కూల్‌లో శుక్రవారం రైసింగ్ వేసవి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఎంఈవో రాజేశ్వర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి: మండల పరిధిలోని బండపోసన్‌పల్లి ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 24నుండి 30 వరకు ఈ శిబిరం కొనసాగుతుందని ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్ తెలిపారు.

నర్సాపూర్‌లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



అవ్వా.. బాగున్నారా అంటూ మిరపకాయల తొడిమలు తీస్తున్న కూలీల బాగోగులు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 ప్రాజెక్టులో భాగంగా నర్సాపూర్ పట్టణంలో నిర్మిస్తున్న 12 కోట్లతో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం వల్ల పట్టణంలో శాశ్వతమంచి నీటి పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నర్సాపూర్‌లో రెండు చోట్ల రూ. 12 కోట్లతో చేపట్టిన వాటర్‌ట్యాంకుల పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వెంట కమిషనర్ రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

● కొల్చారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొల్చారం మండలం పరిధిలో రాంపూర్ పైతర మాందాపూర్ కోనాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారులన నమ్మి రైతులు మోస పోవద్దని తెలిపారు. అంతకుముందు పైతర గ్రామంలో తాగునీటి సమస్యతో పాటు పలు సమస్యలను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకున్నారు. మండలంలోని కోనాపూర్ యనగండ్ల వరిగుంతం పోతంశెట్టిపల్లి అప్పాజీపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా మెదక్ వైపు నుంచి వస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి రాంపూర్ వద్ద పండు మిరపకాయల తొడిమలు తీస్తున్న కూలీల వద్దకు వెళ్లి 15 నిమిషాల పాటు వారి బాగోగులు తెలుసుకున్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో రూ.7.30కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. సాయిరాంనగర్ కాలనీలో సీసీ రోడ్లు, చైతన్యనగర్ ఎస్‌సీ శ్మశాన వాటికలో చితిమంటపాలు, ప్రహరీ నిర్మాణం, సీతారామపురంలో సీసీ రోడ్లు, గౌతమీనగర్ కాలనీలో సీసీ.రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, నాయకులు పాల్గొన్నారు.

● రామచంద్రాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి)రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపల్ పరిధి వెలిమెలలోగల సరోజనమ్మ గుట్ట అభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలసి సరోజనమ్మ గుట్టను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రధానంగా గుట్టపై భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులతో పాటు ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రాం రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): డిజిటల్ లైబ్రరీని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో నూతనంగా డిజిటల్ లైబ్రరీ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. లైబ్రరీని పరిశీలించి, ఇంటర్నెట్ సౌకర్యం, ఇతర వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నా విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం డిజిటల్ విధానాన్ని నెలకొల్పామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, సెక్రటరీ వంశీకృష్ణ, సిబ్బంది నరేందర్ రెడ్డి, శంకర్, యాదగిరి, మురళీ, ఉమాదేవి పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' కోసం 67 మంది అధికారులు

ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ పక్కాగా జరిగేందుకు జిల్లా వ్యాప్తంగా 67 మంది అధికారులను నియమించినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేయుట, పరిశీలించుటకు ఎంపీడీవో, ఏఈ, ఏవో, ఎంపీవోలన బృందాలుగా ఏర్పాటు చేసి ఒక్కొక్క బృందానికి పర్యవేక్షణ అధికారిగా మండలాల ప్రత్యే అధికారులు వ్యవహరిస్తారన్నారు. జిల్లాలోని 21 మండలాలతోపాటు మున్సిపాలిటీలను కలిపి మొత్తం 67 మంది వెరిఫికేషన్ అధికారులుగా నియమించామన్నారు. ఈ నెల 30లోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎంసీహెచ్‌లో పండ్లు పంపిణీ



సంగారెడ్డి ఎంసీహెచ్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్‌వారి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా లెవెల్‌లో ర్యాంకు సాధించిన సందర్భంగా శుక్రవారం సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం తాటి రాంబాబు, డీన్‌లు వెంకటరెడ్డి, డీన్ బాలకృష్ణ మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఆల్ ఇండియా లెవెల్ మొదటి ర్యాంకు, ఓపెన్ క్యాటగిరిలో 100లోపు 10 ర్యాంకులు సాధించిన సందర్భంగా ఎంతో సంతోషంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఏరియా ఇన్‌చార్జి సుబ్బారావు, ఎంఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, రాంప్రసాద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

జహీరాబాద్ ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషిచేస్తున్నానని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హోతి(బి), రూ.5 లక్షలు, రాయిపల్లి(డి) రూ.5లక్షలు మొత్తం రూ.10లక్షలు విలువచేసే సీసీరోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులను అంచెలంచెలుగ జరుగుతాయన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మండలపార్టీ అధ్యక్షులు తట్టునారాయణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

పహల్గాం ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీలు, నల్లబ్యాడ్జీలతో ముస్లిం మైనార్టీల ఆందోళన





పటాన్‌చెరు రూరల్: ఇస్నాపూర్‌లో ముస్లిం మతపెద్దల నిరసన, మెదక్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఐఎంఏ డాక్టర్ల బృందం

న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల నరమేధంపై సంగారెడ్డి, మెదక్ జిల్లాల వ్యాప్తంగా శుక్రవారం నిరసనలు వ్యక్తమయ్యాయి ఆయా మండలాల్లో మృతుల ఆత్మశాంతికి పలు సంఘాలు, నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీలు నిర్వహించారు. ముస్లిం మైనార్టీలు చేతికి నల్లరిబ్బన్లను ధరించి మసీదులలో జుమ్మా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 26 మందిని పొట్టనబెట్టుకున్న ముష్కరులపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలను స్వాగతిస్తామన్నారు. టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. పటాన్‌చెరులో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల శాంతిర్యాలీలో పట్టబద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి పాల్గొన్నారు. పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ చౌరస్తాలో మైనార్టీ సీనియర్ నాయకులు మెరాజ్ ఖాన్, ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లు చేతికి ధరించి ప్రార్థనలు చేశారు. చౌటకూర్ మండలం శివంపేట బీరు పరిశ్రమ కార్మికులు కొవ్వొతులతో నివాళులర్పించారు. అదేవిధంగా కోహీర్, నారయణఖేడ్‌లో ముస్లింలు నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన చేపట్టారు. మెదక్ పట్టణంలోని ప్రధాన మసీదుల్లో ఖుద్బాకీ నమాజ్ అనంతరం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాత్రి వందలాది మంది ముస్లిం యువకులు, మత పెద్దలు పట్టణ ప్రధాన వీధుల గుండా కొవ్వొత్తులు చేత బుచ్చుకుని శాంతి ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో టెర్రరిస్టుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో మృతుల ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నర్సాపూర్‌లో ముస్లింలు కొవొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. నర్సాపూర్ పట్టణంలోని 11వ వార్డులో మసీదు వద్ద ముస్లింలు నల్లబ్యాడ్జీలతో రెండు నిమిషాలు మౌనం పాటించారు. చేగుంటలో మండల మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో ముస్లింలు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. టేక్మాల్ మండలకేంద్రంలో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం ప్రార్థనలో పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమీన్‌పూర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):అమీన్‌పూర్ పట్టణంలో రోడ్డు విస్తరణ నేపథ్యంలో 33కేవీ, 11కేవీ విద్యుత్ లైన్ల తరలింపు పనులు కొనసాగుతున్నందున శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వీరారెడ్డికాలనీ, టీచర్స్‌కాలనీ, ప్రశాంత్ నగర్, దినేష్‌హోమ్స్, వెంకటరమణకాలనీ, భవానీపురం, జవహర్‌నగర్, శివసాయికాలనీ, భ్రమరాంబా ఎంక్లేవ్ తదితర ప్రాంతాలలో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

● **రామచంద్రాపురం:** రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివశంకర్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో ఉస్మాన్‌నగర్ ఫీడర్, ముప్ప ఫీడర్, నిసీ, ఎలియన్స్ తెల్లాపూర్ ఏడీఏ ఫీడర్‌తో పాటు 2బీహెచ్‌కే సరఫరా ఉండదన్నారు. అలాగే 33/11కేవీ ఎంఐజీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు హుడా ఫీడర్, ఎంఐజీ ఫీడర్‌లకు సంబంధించిన ప్రాంతాలతో పాటు ఇందిరానగర్ కాలనీ, కొమురం భీం కాలనీ, జ్యోతిరావుపూలే కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● **రామచంద్రాపురం టౌన్:** రామచంద్రాపురం డివిజన్ పరిధి కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతమ్మ చెప్పారు. శనివారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు రామచంద్రాపురం, శ్రీనివాస్‌నగర్, దర్గా, గార్డెన్‌ప్రాంతం, సండేమార్కెట్, బాంబేకాలనీ, ఈఎస్ఐ ఆసుపత్రి, భారతీనగర్, ఎంఆర్ఎఫ్‌కాలనీ, మ్యాక్ సొసైటీ పరిసరాల్లో సరఫరా ఉండదన్నారు. అలానే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీడీఎల్ క్వార్టర్స్ చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లలో సరఫరా ఉండదని తెలిపారు.

28,30 తేదీల్లో సదరం శిబిరం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 28,30 వ తేదీల్లో సదరం శిబిరం(యూడీఐడీ)ని ర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ ద్వారా లేదా మెసేజ్ ద్వారా సందేశం అందిన వారు మాత్రమే హాజరుకావాలన్నారు.

యువతి అదృశ్యం

జహీరాబాద్ ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని అహ్మద్‌నగర్‌కు చెందిన ఆయేషాబతూన్(20) అదృశ్యమైందని పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. శుక్రవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని అహ్మద్‌నగర్‌కు చెందిన ఆయేషాబతూన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బీజడ్సీ రెండో సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 23న ఎప్పటిలాగే తన చెల్లెలుతో కలిసి ఇంట్లో నుంచి కళాశాలకు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ. వివరించారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 25: పట్టణంలో ఫుట్‌పాత్‌లో ఉంటున్న చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయకూడదని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్‌గౌడ్ కోరారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిళ్ళ అంజనేయులు, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, ప్రభురెడ్డి, లింగారెడ్డి, వంజరి జయరాజు, జుబేర్ తదితరులు ఉన్నారు.తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

చేగుంట ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడియారం శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. చేగుంట ఎస్ఐ చైతన్య రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వడియారం గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై సులబ్ కాంప్లెక్స్ సమీపంలో వ్యక్తి సుమారు 30 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. మూడు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు గోధుమ రంగు ఫుల్‌షర్ట్ ,బ్లాక్ పాయింట్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు .

చిరుత పులి సంచారం.. అప్రమత్తంగా ఉండాలి

మాసాయిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి చెట్ల తిమ్మాయపల్లి పులి గుట్ట తండా వెనుక తండా, తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ మాచినపల్లి వడ్డేపల్లి తదితర గ్రామాలను ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు లభ్యమయ్యాయని ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఓం ప్రకాష్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంత శివారు గ్రామాల ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు

సంగారెడ్డిలో యూనిసెఫ్ బృందం పర్యటన

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో యూనిసెఫ్ బృందం శుక్రవారం పర్యటించింది. యూనిసెఫ్ సభ్యులు నర్సింహారావు, రెష్‌దేశాయ్, గౌరి తొలుత పట్టణంలోని సోమేశ్వరవాడ అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించిన బృందం చిన్నారుల బరువులు, ఎత్తు తదితర అంశాలను ఎలా గుర్తిస్తున్నారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ(న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్) విభాగాలను సందర్శించారు. ఐసీడీఎస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖలు రెండూ సమన్వయంతో బాగా పనిచేస్తున్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు మార్క్స్‌నగర్ యూపీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో డీఐవో డా.మనోహర్‌రెడ్డి, డా.మధుసూదన్, ఐసీడీఎస్ అధికారి సౌమ్య, వైద్య సిబ్బంది వేదుక, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల్లో ఇద్దరు డిబార్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ థియరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు జిల్లా వ్యాప్తంగా ఓపెన్ టెన్త్ 9 కేంద్రాలు, ఇంటర్మీడియట్ 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ అర్థశాస్త్రం సబ్జెక్టు పరీక్షకు 2845 మందికి 2633 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరిగిన ఇంటర్ జీవశాస్త్ర, అకౌంటెన్సీ, హోమ్‌సైన్స్ సబ్జెక్టుకు 495 మందికి 452 మంది హాజరయ్యారు. టెన్త్ హోమ్‌సైన్స్ సబ్జెక్టుకు 65 మందికి 53 మంది హాజరయ్యారు. కాగా సంగారెడ్డిలో కాంపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరిని డిబార్ చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధచూపాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య బాల సదన్‌ నిర్వాహకులకు సూచించారు. సంగాడ్డి పట్టణంలోని బాల సదన్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మంచి చదువులు చదివి ఉన్నతంగా ఎదుగుదల ఎదగాలని అన్నారు. ఏదైనా న్యాయ సహాయం అవసరమైతే సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

2030 నాటికి మలేరియాను నిర్మూలించాలి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) :మలేరియాను 2030 నాటికి పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ సూచించారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలోని జడ్పీ కార్యాలయం నుంచి డీఎంహెచ్‌వో ఆఫీస్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలతో వ్యాపించే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ ఫ్రైడే డ్రైడేగా పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా.ప్రవీణ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డా.సునంద, డా.సంధ్యరాణి, పీవోడీటీటీ డా.శశాంక్, డెమో ప్రసాద్, వైద్య ఉద్యోగులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

పుల్‌కల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రధాన గేటు వద్ద కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపడుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం 7వ రోజుకు చేరుకున్నది. ఎమ్మెల్సీ అంజిరెడ్డి నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏ.వెంకటనరసింహరెడ్డి, పోచారం రాములు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

మనూరు/నారాయణఖేడ్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని దుద్దగొండ గ్రామ పంచాయతీ పరిధిలోని ఘట్‌లింగంపల్లి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచులు రాజు, బ్రహ్మానందరెడ్డి, నాయకులు చందుపటేల్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా నారాయణఖేడ్ మండల పరిధిలోని ర్యాకల్‌లో ఈనెల 23న ప్రారంభమైన ఎల్లమ్మతల్లి జాతర ఉత్సవాలు 3వ రోజైన శుక్రవారం కొనసాగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి దర్శించుకొని హారతినిచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి

చిన్నశంకరంపేట ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెడిసిటీ సౌజన్యంతో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 1500 మంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ పోడెండ్ల లక్ష్మణ్ యాదవ్,రాష్ట్ర ఎంసీ మెంబర్ సింగం శ్రీనివాస్ రావు, కార్యదర్శి టి. సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డి.జి శ్రీనివాస్ శర్మ, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి, మద్దెల సత్యనారాయణ,సభ్యులు తోట శ్రీనివాస్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం పాల్గొన్నారు.